సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 17 । మే । 2023



ప్రసవం అనంతరం బాలింత మృతి

వైద్యుడి కారణంగా బాలింత మృతి చెందిందని బంధువులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. మూడు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. - 8లో▸



సూపరింటెండెంట్‌ను అరెస్ట్ చేయాలి

కులం పేరుతో దూషించిన ఎంజీఎం సూపరింటెండెంట్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని గోర్ బంజారా సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
42^0/26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉంటుంది. సాయంత్రం ఉక్కపోత ఉండనుంది.

న్యూస్‌రీల్

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ హెడ్‌గా మంగళవారం ఆ కళాశాల ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ గాదె సమ్మయ్యనుంచి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లపాటు ఆ పదవిలో ఉండనున్నారు.

'భూ ఆక్రమణ ఆరోపణలు అవాస్తవం'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పలివేల్పుల రహదారి లష్కర్‌సింగారం శివారులోని 32, 32/1 సర్వేనంబర్లలో భూమి ఆక్రమణకు యత్నించారనే ఆరోపణలు అవాస్తమని, తమకు చెందిన స్థలాన్నే చదును చేసుకున్నామని ఇద్దరు యజమానులు మంగళవారం తెలిపారు. తమ స్థలాల్లోనే నిర్మాణాల కోసం భూమిని చదును చేసుకుంటూ అక్కడే సాయంత్రం వరకు ఉన్నామని, పారిపోయినట్లు వచ్చిన వార్తలో నిజం లేదని పేర్కొన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన అధికారులకు కూడా తమ వద్ద ఉన్న పత్రాలను చూపించామని ఆ యజమానులు తెలిపారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస గౌరవ వేతనం రూ.30వేలు, పట్టణ ప్రాంతంలోని రేషన్ డీలర్లకు రూ.35 నుంచి రూ.40 వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించని పక్షంలో జూన్ 5నుంచి నిరవధిక సమ్మెకు దిగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు పోతరాజు రమేష్, మహేశ్వరం గౌరీశంకర్, సమ్మయ్య, మల్లయ్య, మేకల తిరుపతి, సాంబయ్య అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

'అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ' ఫీజు గడువు పెంపు

విద్యారణ్యపురి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 19 వరకు పొడిగించినట్లు హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ మంగళవారం తెలిపారు. విద్యార్థులు గమనించాలని కోరారు. జూన్ 3వ తేదీనుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు నేటివరకు..

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ ఫీజు చెల్లింపు గడువు బుధవారం వరకు ఉందని గోపాల్ తెలిపారు.

మూడు జిల్లాల డీసీసీ అధ్యక్షుల నియామకం

భూపాలపల్లికి ఎ.ప్రకాశ్‌రెడ్డి, ములుగుకు పైడాకుల అశోక్, వరంగల్‌కు స్వర్ణ



ప్రకాశ్‌రెడ్డి | అశోక్ | ఎర్రబెల్లి స్వర్ణ

సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎట్టకేలకు డీసీసీ అధ్యక్షుల నియామకం చేపట్టింది. పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తూ ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లికి ఎ.ప్రకాశ్‌రెడ్డి, ములుగు జిల్లాకు పైడాకుల అశోక్, వరంగల్ జిల్లాకు ఎర్రబెల్లి స్వర్ణను నియమించారు. స్వర్ణ పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారు. వరంగల్ నగర మేయర్‌గా కూడా పనిచేశారు. ప్రకాశ్‌రెడ్డి గతంలోనూ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. మళ్లీ ఆయనకే బాధ్యతలు అప్పగించారు. ములుగు జిల్లాకు గతంలో కుమారస్వామి ఉండగా ఆయన మరణంతో ఖాళీ అయ్యింది. తాజాగా టీపీసీసీ కార్యదర్శిగా ఉన్న అశోక్‌ను నియమించారు.

ఓటమి నుంచి గెలుపుబాట!



జరిగిన తప్పిదాల్ని సరిదిద్దుకుంటే ఉన్నత శిఖరాలకు..

- పరీక్షల్లో ఫెయిలయ్యామన్న బాధలో అఘాయిత్యాలు
- ఉమ్మడి జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న విద్యార్థుల బలవన్మరణాలు
- రెండు నెలల్లోనే తొమ్మిదిమంది ఆత్మహత్య
- తల్లిదండ్రులకు కడుపుకోత ● తొందరపాటు నిర్ణయాలు వద్దంటున్న మనోవైద్యులు

పరీక్షల్లో తప్పామని.. విషయం తెలిస్తే ఇంట్లో తల్లిదండ్రులు తిడతారేమోనని, స్నేహితుల్లో పలుచన అవుతామన్న ఆత్మన్యూనతాభావంతో విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల తల్లిదండ్రులకు తీరని కడుపుకోతను మిగుల్చుతున్నారు. వారిపై పెట్టుకున్న ఆశలను మధ్యలోనే తుంచేసుకుని వెళ్లిపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొద్ది రోజులుగా విద్యార్థుల బలవన్మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో సుమారు 9మంది అఘాయిత్యాలకు పాల్పడ్డారు. తల్లి మందలించిందని, ఇంటర్‌లో ఫెయిలయ్యామని, డిగ్రీలో సబ్జెక్టులు తప్పానని మరికొన్ని కారణాలతో ప్రాణాలు తీసుకున్నారు. తాజాగా మంగళవారం చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థులు చనిపోగా, మరో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పరీక్షల్లో ఫెయిలయ్యామని భావన వీడి చేసిన తప్పిదాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, చిన్న చిన్న కారణాలకు ప్రాణాలు తీసుకోవద్దని మానసిక నిపుణులు అంటున్నారు.

- వరంగల్ డెస్క్



రెండు నెలల్లో బలవన్మరణాలు ఇలా..

- చదువుకోకుండా ఎందుకు జులాయిగా తిరుగుతున్నావని తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన వరంగల్‌జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లికి చెందిన డిగ్రీ విద్యార్థి నితిన్(21) ఈ నెల 14న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజుపల్లికి చెందిన అంబటి రాకేశ్ (19) ఇంటర్ విద్యార్థి ఫెయిల్ అయ్యానని సోమవారం ఉరేసుకుని చనిపోయాడు. కుమారుడిపై ఎన్నో ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులు కవిత-కుమారస్వామి దంపతులకు కడుపుకోత మిగిల్చాడు.
- మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పానుగోడుకు చెందిన తేజావత్ పూలు, లీల దంపతుల కుమార్తె సింధు(17) ఇంటర్‌లో ఫెయిల్ అయ్యానని గత మంగళవారం పురుగుల మందు తాగింది. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మరణించింది.
- ఇంటర్ పూర్తి చేసిన జనగామ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన పసునూరి వినయ్ ఈ నెల 3న ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. కారణం తల్లిదండ్రులకు తెలియని పరిస్థితి.
- వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లి శివారు బాలాజీ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఫైనలియర్ విద్యార్థి ఈ నెల 5న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- కాలేజీకి వెళ్లమని తల్లి మందలించిందని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చిర్రకుంట తండా శివారు కోయగూడేనికి చెందిన చెరుప వేణు ఏప్రిల్ 4న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



ఈ ఫొటోలో.. కుమారుడి ఫొటో పట్టుకుని తల్లి రోదిస్తున్న తీరు.. మాటలకందని విషాదం. మనస్సు కలిచివేసే ఘటన. 'గిరిజన బిడ్డనైనా డాక్టర్‌ను అవుతా.. పేదలకు వైద్యమందిస్తా' అని కొడుకు చెబుతుంటే ఆ తల్లిదండ్రులు సంతోషించేవారు. కానీ మధ్యలోనే వారిని వదిలేసిపోవడంతో వారికి తీరని కడుపుకోతే మిగిలింది. ఎంబీబీఎస్ సీటు రాదేమోనన్న భావనతో గత నెల 11వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పీక్లా తండా జీపీ శివారు బోడగుట్టతండాకు చెందిన గుగులోత్ కృష్ణ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతను ఇంటర్‌లో 892/1000 మార్కులు సాధించి 'ఏ'గ్రేడ్‌లో పాసయ్యాడు. కొడుకు రిజల్ట్ చూసిన అతడి తల్లిదండ్రులు కొడుకు ఫొటోను పట్టుకుని బోరున విలపించారు.

తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలి



తల్లిదండ్రులు.. నిత్యం పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలి. పిల్లలు ఏదైనా సందర్భంలో మౌనంగా ఉన్నా...ఒంటరిగా ఉండి ఆలోచనలు చేస్తున్నా దానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలి. పరీక్షలు తప్పినంత మాత్రాన జీవితం ముగిసిపోదన్న విషయాలను విద్యార్థులు గుర్తించాలి. విలువైన జీవితాలను క్షణికావేశంలో నాశనం చేసుకోవద్దు. ఆశావాద దృక్పథంతో ముందుకు సాగాలి. - ఏవీ రంగనాథ్, సీపీ వరంగల్



మహబూబాబాద్ జిల్లా సాలార్‌తండాకు చెందిన భూక్యా హతిరాం, జమున దంపతుల కుమార్తె రాజేశ్వరి(19) సూర్యాపేటలోని ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదివింది. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరంలో కొన్ని సబ్జెక్టులు ఫెయిలైంది. తోటివాళ్లంతా పాసవుతున్నారు తను మాత్రం పాస్ కాలేకపోతున్నానన్న భావనతో ఈ నెల 14న గడ్డిమందు తాగింది. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయింది.



ఒక్క క్షణం ఆలోచించండి..

- ఆత్మహత్యకు దారితీసే కారణాలను తెలుసుకోవడం, హెచ్చరిక సంకేతాలను గుర్తించడం వల్ల ఆత్మహత్యలను నివారించేందుకు సహాయపడుతుంది.
- ఎందులో ఫెయిలయ్యాం.. ఎందుకిలా జరిగింది.. చేసిన లోపాలను మననం చేసుకోవాలి.
- ఫెయిలైన సబ్జెక్టుకు సంబంధించి తిరిగి ప్రణాళికాబద్ధంగా చదవడం.. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడం..
- మనపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్న దృఢ సంకల్పం.
- బాధను స్నేహితులు, తల్లిదండ్రులతో పంచుకోవడం వల్ల మనసులోని భారం తగ్గిపోతుంది.

అర్థం చేసుకోవాలి..



విద్యార్థులను సంపూర్ణ వికాసం లేకుండా తల్లిదండ్రులు నాలుగు గోడల మధ్య పెంచడంతో వారు సున్నిత మనస్కులు అవుతారు. పరీక్షల్లో ఫెయిలైతే చులకనభావనగా చూస్తారని, ఈ సమాజంతో మనకేం పని అన్నట్లు ఆ క్షణంలో చనిపోవాలని నిర్ణయం తీసుకుంటారు. పిల్లల ఆలోచనలు, వారి భావోద్వేగాన్ని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. వారితో మనసు విప్పి మాట్లాడాలి. పిల్లలు కూడా జరిగిన పొరపాట్లను గుర్తించి మరోసారి అలాకాకుండా చూసుకుంటే చావే పరిష్కారం కాదనే భావననుంచి బయటపడొచ్చు.

- ఎర్ర శ్రీధర్ రాజు, ప్రముఖ సైక్రియాట్రిస్ట్



జనగామ జిల్లా లింగాలఘణపురానికి చెందిన గండి వైష్ణవి(19) భూపాలపల్లి సాంఘిక సంక్షేమ డిగ్రీ (ప్రస్తుతం హసన్‌పర్తిలో నిర్వహిస్తున్న) కళాశాలలో మొదటి సంవత్సరంలో రెండు సబ్జెక్టులు తప్పింది. తాను ఆత్మహత్య చేసుకుంటానని వైష్ణవి సహా విద్యార్థినులకు తెలిపింది. సోమవారం రాత్రి ఏవో మాత్రలు మింగినట్లు గుర్తించి మంగళవారం ఉదయం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

క్షణికావేశం.. తల్లిదండ్రులకు దూరం - 8లో▸

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ఏర్పాటు చేయండి

గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: రెడ్యూస్, రీయూజ్, రీ సైక్లింగ్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లను ఏర్పాటు చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి సూచించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటరీ అధికారులు, మెప్మా, ఇతర సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి జూన్ 5 వరకు 'మేరా లైఫ్ స్వచ్ఛ షహర్' కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో 66 డివిజన్‌లలో ఒక్కో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు వినియోగించిన (పాత) పునరుత్పత్తి చేసే వస్తువులైన ప్లాస్టిక్, బట్టలు, పుస్తకాలు,పాద రక్షలు అందజేసేలా (సేకరించేలా) చూడాలన్నారు. అందుకోసం స్థానిక కార్పొరేటర్ల సహకారంతో ఈ నెల 18,19 తేదీలలో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి నగర ప్రజల్లో చైతన్యం కలిగించాలని చెప్పారు. సమావేశంలో సీఎంహెచ్‌ఓ రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, టీఎంసీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాపై మేయర్ ఆరా

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 18వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు, పబ్లిక్ హెల్త్, బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరుగుతూ మంచినీటి సరఫరా తీరును పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలను అధిగమించి అన్ని గృహాలకు అందించేందుకు బల్దియా చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. లీకేజీలపై పలు సూచనలు చేశారు. ఆమెవెంట మాజీ కార్పొరేటర్ కుందరాపు రాజేందర్, బల్దియా ఈ ఈ శ్రీనివాస్, డీఈ రవి కిరణ్, రవీందర్, ఏఈ సౌజన్య, మిషన్ భగీరథ ఇంజినీర్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓ సిటీ డంపింగ్ పాయింట్ వద్ద స్వచ్ ఆటోనుంచి నేరుగా కంప్రెక్టర్ వాహనంలో చెత్త వేస్తున్న తీరును మేయర్ పరిశీలించారు.

డివిజన్‌కు ఓ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి

క్రీడలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ప్రతి డివిజన్‌కు ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ సత్యనారాయణ ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 10 లక్షల లోపు జనాభా గల మున్సిపాలిటీల్లో కచ్చితంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనీసుర్ రషీద్, ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు జిల్లా అడ్‌హక్ కార్యవర్గం



విజయసంకేతం చూపిస్తున్న మున్నూరు కాపు సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మంగళవారం జిల్లా మున్నూరు కాపు సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం బలోపేతానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నూతన అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి సంఘాన్ని పటిష్టం చేయడంతో పాటు గ్రామ, మండల స్థాయి నుంచి కమిటీలు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమావేశ అధ్యక్షుడు పుప్పాల రజనీకాంత్ తెలిపారు. జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా కొత్త దశరథం, ఉపాధ్యక్షులుగా తోట కనక రాములు, మాందాటి రవీందర్, బక్కి రాజ్ కుమార్, శేషాల కుమార్, అల్లం మల్లికార్జున్ రావు, లింగంపల్లి రత్నాకర్, మిరుకుల మనోహర్, తోట సమ్మయ్య ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా సాయిని రవీందర్, కర్ర వెంకటేశ్వర్లు, గుర్రాల చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శులుగా గజ్జి రమేష్, పంచగిరి గిరి ప్రసాద్, కటకం రాజు, తోట ప్రకాష్, గంధ్రతి రాజు, కత్తుల కవిత, గుండ్ల శ్రీనివాస్, కొండ నాగరాజు, జింకల లక్ష్మణ్ రావు, బక్కి సురేందర్, ఆకుల శ్రీకాంత్, కోశాధికారిగా కూరపాటి సత్యప్రకాశ్ ఎన్నికయ్యారు. మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రైతులకు 'నకిలీ' గండం

మార్కెట్లోకి మళ్లీ నకిలీ విత్తనాలు

- వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధం
- కాన్ఫరెన్స్ ద్వారా అప్రమత్తం చేసిన మంత్రి
- పోలీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖలకు ఆదేశాలు
- మహారాష్ట్ర నుంచి హనుమకొండకు రవాణా
- గతేడాది దొరికిన నకిలీ విత్తనాలు.. ఈసారి సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- కలెక్టర్‌ల నేతృత్వంలో రంగంలోకి తనిఖీ బృందాలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సీపీ, కలెక్టర్లు, ఇతర అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వానాకాలం(ఖరీఫ్) ఈసారి అనుకూలంగా ఉంటుందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రుతు పవనాలు ముందుగా వచ్చే అవకాశం ఉందన్న సమాచారంతో పల్లెల్లో హడావుడి మొదలైంది. విత్తన, ఎరువులు దుకాణాల నిర్వాహకులు దూకుడు పెంచారు. ఈసారి ఒక్కడుగు ముందుకేసి నేరుగా గ్రామాలకే తీసుకెళ్లి విత్తనాలు సరఫరా చేసే వ్యూహంలో ఉన్నారు. గంపగుత్తగా హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విత్తనాలు కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువులు మార్కెట్లోకి వచ్చే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి..మంగళవారం జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, వ్యవసాయశాఖ అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అప్రమత్తం చేశారు.

ఈసారీ సాగు పెరిగే అవకాశం..

2022 వానాకాలం సీజన్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో 5,14,641 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. అందుకు భిన్నంగా 5,53,162 (107.48 శాతం) ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. రెండు జిల్లాల్లో 2,78,154 ఎకరాల్లో వరి, 2,12,312 ఎకరాల్లో పత్తి, 16,334 ఎకరాల్లో మొక్కజొన్న, 16,362 ఎకరాల్లో ముతకధాన్యాలు, మరో 30 వేల ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. గత వానాకాలంలో రైతులు పత్తిసాగుపైన ఆసక్తి చూపడంతో దళారులు, వ్యాపారులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హనుమకొండ, వరంగల్‌కు నకిలీ విత్తనాలు సరఫరా చేశారు. 2022 మే 9న వరంగల్‌లో ఒక్కరోజే రూ.21.87 లక్షల విలువ చేసే పత్తి విత్తనాలు టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ పత్తి విత్తనాలన్నీ కూడా మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతంనుంచి తరలించి నిల్వ చేసినట్లు గుర్తించారు. పరకాల సబ్ డివిజన్ పరిధిలో సుమారు రూ.2.50 లక్షల విలువ చేసే పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. నకిలీ విత్తనాలతోపాటు నాన్ నోటిఫైడ్ విత్తనాల విక్రయాలను కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం డివిజన్‌కో టాస్క్‌ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులను సభ్యులుగా నియమించగా, నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా దుకాణాల్లో తనిఖీలు చేసి నియంత్రించారు. లాట్ నంబర్ రాయకుండా లేబుల్ లేని విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తించి పది మందికి నోటీసులు కూడా జారీ చేశారు. ఈసారి కూడా సాగు పెరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం యంత్రాంగాన్ని ముందే అప్రమత్తం చేసి టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది.

అధికారులతో మంత్రి నిరంజన్ కాన్ఫరెన్స్...

మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంనుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, డీజీపీ అంజనీ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి వానాకాలం సీజన్ ముందస్తు ఏర్పాట్లపై వ్యవసాయ, టాస్క్‌ఫోర్స్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులను స్టాక్ ఉంచుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి పక్క రాష్ట్రాలనుంచి వచ్చే నకిలీ విత్తనాలు, ఎరువులపై దృష్టి పెట్టి పకడ్బందీగా నియంత్రించాలని సూచించారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు అధికారులను ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అనుమానిత ప్రదేశాల్లో వెంటనే శాంపిల్స్ చెక్ చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై సమాచారం ఇవ్వండి

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరైన వ్యాపారస్తులు, సంస్థలు, వ్యక్తులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకు గాని లేదా వరంగల్ పోలీస్ కమిషనర్ ఫోన్ నంబర్ 8712685100, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఫోన్ నంబర్ 8712685148, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఫోన్ నంబర్ 8712685101కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు, తగిన పారితోషికాలను అందిస్తామని పేర్కొన్నారు.

- వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

అర్ధరాత్రి శబ్ద కాలుష్యానికి పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: అర్ధరాత్రి సమయాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా డీజే, బ్యాండ్‌లను ఉపయోగిస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాలోని డీజే, బ్యాండ్ వాయిద్యకారులు, ఆర్కెస్ట్రా బృందాలతో సీపీ రంగనాథ్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్ధరాత్రి సమయాలలో డీజే వినియోగించడం ద్వారా ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సుప్రీ కోర్టు మార్గదర్శకాలను అనుసరించి రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి సౌండ్ బాక్స్ వినియోగించడం, వాయిద్యాలను ఉపయోగించరాదని తెలిపారు. వీటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని రాత్రి 12 గంటల లోపు శుభకార్యాలు, ఊరేగింపులకు డీజే, బ్యాండ్ వాయిద్యకారులు, ఆర్కెస్ట్రాలు వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఎవరైనా శబ్ద కాలుష్యానికి గురిచేస్తూ డీజే వినియోగిస్తున్నట్లయితే తక్షణమే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమావేశంలో డీసీపీలు అబ్దుల్ బారి, కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ తిరుమల్, ఇన్‌స్పెక్టర్లు సతీష్‌బాబు, రాంబాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

గవర్నర్ రైలు ప్రయాణ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

డోర్నకల్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం డోర్నకల్ స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో ప్రయాణించనున్నారు. మంగళవారం రాత్రి ప్రత్యేక రైలులో సికింద్రాబాద్ నుంచి బుధవారం తెల్లవారు జామున కొత్తగూడెం చేరుకుని అక్కడి నుంచి భద్రాచలం వెళ్తారు. భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనే గవర్నర్ సాయంత్రం రోడ్డు మార్గంలో డోర్నకల్ చేరుకుని రైల్వే స్టేషన్ నుంచి మణుగూరు, బెలగావి ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ వెళ్తారు. డోర్నకల్ స్టేషన్‌లోని రైలు బోగి వద్దకు చేరుకునే మార్గాన్ని గవర్నర్ సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మహబూబాబాద్ ఆర్డీఓ కొమరయ్య, తహసీల్దార్ స్వాతిబిందు, సీఐ వెంకటరత్నం, మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, స్టేషన్ మేనేజర్ ప్రసాద్ తదితరులు పరిశీలించారు. కొత్తగూడెం నుంచి రైలు స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫారానికి రానుండటం, ప్లాట్‌ఫారం వరకు గవర్నర్ వాహనం వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులు పరిశీలించారు. పట్టణంలో గవర్నర్ ప్రయాణించే మార్గాన్ని శుభ్రపర్చాలని ఆర్డీఓ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

కేసు నమోదు

గార్ల: అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై కేసు నమోదైనట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన పి.ప్రత్యూష.. అదే గ్రామ పంచాయతీలోని దేశ్యాతండాకు చెందిన ఎం.ప్రసాద్ ఏడాది క్రితం కూలాంతర వివాహం చేసుకున్నారు. వీరికి 2 నెలల పాప వుంది. ఈక్రమంలో 2నెలల నుంచి భర్త ప్రసాద్, భార్యను వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ప్రత్యూష మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్షణికావేశం.. తల్లిదండ్రులకు దూరం

నవమాసాలు మోసి కనిపెంచితే వృద్ధాప్యంలో తోడుగా ఉంటారనుకున్న బిడ్డలు క్షణికావేశంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలతో ఆ తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.. పరీక్షలో ఫెయిల్ అయ్యానని ఒకరు.. తండ్రి మందలించాడని మరొకరు.. చదువులో రాణించలేకపోతున్నానని ఓ విద్యార్థిని ఇలా చిన్నచిన్న కారణాలతో తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు. మంగళవారం ఒకేరోజు ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్య కు పాల్పడడం బాధాకరం.

తండ్రి మందలించాడని విద్యార్థి ఆత్మహత్య


నితిన్(ఫైల్)

సంగెం: చదువుకోకుండా ఎందుకు జులాయిగా తిరుగుతున్నావని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తీగరాజుపల్లి గ్రామానికి చెందిన చింపాల రమేష్, అరుణ దంపతుల పెద్ద కుమారుడు నితిన్(21) హనుమకొండలోని చైతన్య డిగ్రీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 29నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయని, ఇంటివద్ద ఉండి చదువుకోకుండా ఎందుకు తిరుగుతున్నావని ఈనెల 14న ఆదివారం తండ్రి రమేష్ మందలించాడు. అనంతరం తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లారు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నితిన్ పురుగుల మందు తాగుతుండగా రమేష్ చెల్లెలు కుమారుడు చూసి సమాచారం అందించడంతో వెంటనే వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రికి తరలించారు. ఈనేపథ్యంలో నితిన్ మంగళవారం ఆస్పతిలో మృతి చెందాడు. నితిన్ తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

నాడు తమ్ముడు.. నేడు అన్న

అరుణ రమేష్ దంపతులుకు ఇద్దరు కుమారులు నితిన్, నిఖిల్‌లు. 2020 జనవరిలో 7వ తరగతి చదువుతున్న తమ్ముడు నిఖిల్(12) పురుగుల మందు తాగి 10 రోజులు చికిత్స అనంతరం ఆస్పత్రిలో మృతి చెందాడు. నేడు అన్న నితిన్ కూడా అదేవిధంగా మృతి చెందాడు. మూడేళ్ల వ్యవధిలో క్షణికావేశంతో ఇద్దరు కుమారులు ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఆత్మహత్యాయత్నం

హసన్‌పర్తి: భూపాలపల్లి సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తితే... జనగామ జిల్లా లింగాలఘణపురానికి చెందిన గండి వైష్ణవి భూపాలపల్లి సాంఘిక సంక్షేమ డిగ్రీ (ప్రస్తుతం హసన్‌పర్తిలో నిర్వహిస్తున్నారు.) కళాశాలలో 2022–2023లో మొదటి సంవత్సరం ఎంజెడ్సీ ప్రవేశం పొందింది. కాగా, సోమవారం రాత్రి వెలువడిన డిగ్రీ మొదటి సంవత్సరం ఫలితాల్లో వైష్ణవి రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయింది. దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటానని తోటి విద్యార్థినులకు తెలిపింది. ఈక్రమంలో వైష్ణవి టాబ్లెట్స్ మింగినట్లు తమకు తెలియజేయడంతో తోటి విద్యార్థినులు మంగళవారం ఉదయం అధ్యాపకులకు సమాచారం అందించారు. దీంతో బాధితురాలిని హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. అయితే వైష్ణవి మాత్రం గుళికలు మింగిన విషయాన్ని ప్రిన్సిపాల్ వింధ్యారాణి కొట్టివేశారు. డిప్రెషన్‌కు గురి కావడంతో ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. వైష్ణవి టాబ్లెట్స్ మింగినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తమన్నారు.

పాస్ కావడంలేనని విద్యార్థిని..



మహబూబాబాద్ రూరల్: ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులో పాస్ కావడంలేననే మనస్తాపంతో ఓ విద్యార్థిని పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈఘటనకు సంబంధించి టౌన్ సీఐ వై.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం .. సాలార్‌తండాకు చెందిన భూక్యా హతీరాం, జమున దంపతుల కుమార్తె రాజేశ్వరి (19) సూర్యాపేటలోని ఎస్వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదివింది. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరంలో కూడా కొన్ని సబ్జెక్టులు ఫెయిలైంది. ఆమెకు చదువు రావడం లేదని, పాస్ కావడం లేదని కొంతకాలం నుంచి మనాదిగా ఉంటుంది. తోటివిద్యార్థులు పాసవుతున్నా తాను మాత్రం పాస్ కాలేకపోతున్నానని ఆమె తల్లి జమునతో అంటూ ఉండేది. దీంతో తల్లి ధైర్యం చెప్పి ఓదార్చేది.. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు రాజేశ్వరి తండా సమీపంలోని భద్రన్నకాలనీ ప్రాంతంలో వంకాయలతోటలో గడ్డిమందు తాగి వాంతులు చేసుకుంటుండగా హతిరాం తమ్ముడి భార్య విజయ చూసింది. స్థానికుల సాయంతో రాజేశ్వరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. కాసేపటికి తల్లిదండ్రులు ఆస్పత్రిలో మందు ఎందుకు తాగావని ప్రశ్నించగా.. ఎప్పటికీ పాసు కావడం లేదని బయపడి చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పింది. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లారు. అక్కడ కూడా వైద్య చికిత్స అందించిన అనంతరం మరింత మెరుగైన వైద్యం అవసరమని పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అదే రోజున ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించగా వారు కూడా ఆమె బ్రతకడం కష్టమని చెప్పారు. వెంటనే మళ్లీ మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చి ఐసీయూలో చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి రాజేశ్వరి మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ మన్సూర్‌అలీ ఘటనపై వివరాలు సేకరించారు. కేసు నమోదు, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

ప్రసవం అనంతరం బాలింత మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమేనంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- మరిపెడలో జాతీయ రహదారిపై రాస్తారోకో
- మూడు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్
- పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట


మరిపెడలో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

మరిపెడ: వైద్యుడి కారణంగానే మృతి చెందిందని ఆరోపిస్తూ మృతదేహంతో బంధువులు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని జాతీయరహదారిపై మంగళవారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే మరిపెడకు చెందిన భాగ్యలక్ష్మీ(23) మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉదయం మగశిశువుకు జన్మనిచ్చింది. చిన్న ఆపరేషన్(నార్మల్ డెలివరీ) చేసి స్థానిక వైద్యాధికారి గుగులోతు రవికుమార్ పని నిమిత్తం బయటికి వెళ్లారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3గంటల సమయంలో భాగ్యలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఆ తర్వాత పీహెచ్‌సీకి వచ్చిన వైద్యాధికారి మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.

డాక్టర్ నిర్లక్ష్యంతోనే..

డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తన భార్య మృతి చెందిందని మృతురాలి భర్త వెంకటేష్ చెప్పాడు. ఆస్పత్రిలో ప్రసవం చేసిన డాక్టర్ రవికి ఫోన్‌రాగానే వెళ్లాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా తిరిగి రాలేదు. గంటన్నర తర్వాత వచ్చి మహబూబాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. అప్పటిదాకా మంచిగానే ఉన్న భాగ్యలక్ష్మికి ఇప్పుడు ఏమైంది అని అడిగితే బయటికి వెళ్లు అని సమాధానం ఇచ్చాడు. అయితే ప్రసవ సమయంలో ఆపరేషన్ చేసి కుట్లు సరిగా వేయకపోవడంతో రక్తస్రావం జరిగినట్లు మహబూబాబాద్ ఆస్పత్రి వైద్యులు చెప్పారన్నారు.

మూడు గంటల పాటు ఉద్రిక్తత..

భాగ్యలక్ష్మి మృతదేహం సోమవారం అర్ధరాత్రి మరిపెడ పీహెచ్‌సీకి తీసుకొవచ్చారు. మంగళవారం ఉదయం 8గంటలకు మండల కేంద్రంలోని జాతీయరహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సీఐ సాగర్ నేతృత్వంలో బాధితులతో మాట్లాడే ప్రయత్రం చేసినా వారు ససేమిరా అనడంతో రెండు గంటల అనంతరం ఆందోళనకారులను శాంతింప చేసే క్రమంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. జాతీయ రహదారి కావడంతో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్యతో పోలీసులు పలు సెంటర్లలో ఉండి వాహనాలను వేరే మార్గాల ద్వారా పంపించారు. అనుక్షణం ఉత్కంఠ వాతావరణంలో ఆందోళనకారులను పోలీసులు డీసీఎం వాహనంలో తరలించారు. అనంతరం మృతదేహాన్ని వేరే వాహనంలో పోస్టుమార్టం నిమిత్తి మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. భాగ్యలక్ష్మికి జన్మించిన శిశువు ఆరోగ్యంగానే ఉన్నట్లు సమాచారం.

రైల్లోనుంచి జారిపడి వ్యక్తి మృతి


రైల్వేట్రాక్‌పై నాగేశ్వర్ రావు మృతదేహం

కేసముద్రం/కాశిబుగ్గ: ప్రయాణిస్తున్న రైల్లో నుంచి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన బొల్లం నాగేశ్వర్‌రావు(52) కాజీపేటకు వెళ్లేందుకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ఈ క్రమంలో అప్‌లైన్‌లో వెళ్తున్న రైల్లో ఫుట్‌డోర్ వద్ద కూర్చుని ప్రయాణిస్తుండగా, కేసముద్రం రైల్వేస్టేషన్ దాటాక ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని 421/17–15 కిలోమీటర్ రాయివద్ద ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. దీంతో తల పగిలిపోయి, రెండుపాదాలు తెగిపోయి, శరీర భాగాలు రాపిడికి గురవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అయితే మృతుడు నాగేశ్వరరావు హోటల్ వ్యాపారం నిర్వహించేవాడని సమాచారం.

ఎంజీఎం సూపరింటెండెంట్‌ను అరెస్టు చేయాలి

- కలెక్టర్‌కు గోర్ బంజారా సంఘాల వినతి


కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరీమాబాద్: కులం పేరుతో దూషించిన ఎంజీఎం సూపరింటెండెంట్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం గోర్ బంజారా సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మెంబర్ నూనావత్ జవహర్ మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీన దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన కాసు రాములు యాదవ్ మరణించిన సందర్భంలో సానుభూతి తెలిపేందుకు వెళ్లిన అజ్మీరా వెంకట్, మాలోతు విజయ్, గుగులోతు తిరుపతిలను సూపరింటెండెంట్ చంద్రశేఖర్ కులం పేరుతో దూషించడంతో వారు మట్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలియగానే సూపరింటెండెంట్ విధులకు ఆటంకం కలిగించారని అజ్మీరా వెంకట్, మాలోతు విజయ్, గుగులోతు తిరుపతిలపై కేసు పెట్టారని ఆరోపించారు. కక్ష్య సాధింపు చర్యలో భాగంగానే డాక్టర్ చంద్రశేఖర్ కథ అల్లుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంజీఎంలో జరుగుతున్న అఘాయిత్యాలు, మరణాలపై విచారణ జరిపి వెంకట్, విజయ్, తిరుపతిలపై పెట్టిన 353 సెక్షన్ కేసును ఎత్తివేసి డాక్టర్ చంద్రశేఖర్‌పై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాదావత్ బాలాజీ నాయక్, నునావత్ రవీందర్, వినేష్, కిషన్‌నాయక్, లోక్ వినోద్ నాయక్, రాజు, వసంత్, భాస్కర్, ఫణి, అజ్మీరా శ్రీనివాస్, తిరుపతి, సునీల్, ప్రదీప్, వెంకట్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

66బాటిళ్ల ఎన్‌డీపీ మద్యం స్వాధీనం

- ఐదుగురి అరెస్ట్, కారు స్వాధీనం


మద్యం బాటిళ్లు, నిందితులను చూపుతున్న అధికారులు

కాజీపేట అర్బన్: సుంకం చెల్లించని ఇతర రాష్ట్రాలకు చెందిన 66 బాటిళ్ల ఎన్‌డీపీ మద్యాన్ని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు మంగళవారం పట్టుకున్నారు. కాజీపేట దర్గా రోడ్డులోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.నాగేందర్‌రావు వివరాలు వెల్లడించారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశాల మేరకు ఎన్‌డీపీ మద్యాన్ని రైలు మార్గంలో సరఫరా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానాస్పదంగా తారసపడిన మడికొండకు చెందిన మాడుగుల శ్రీకాంత్, మాడుగుల శ్రీరాం, వడ్డెపల్లి రమేష్, గొర్రెకుంటకు చెందిన సాహెబ్ హుస్సేన్, నాయుడు పెట్రోల్‌పంప్‌కు చెందిన మునికుంట విజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా హర్యానా రాష్ట్రంలోని హిస్సార్ నుంచి హిస్సార్ ఎక్స్‌ప్రెస్ రైలులో సుంకం చెల్లించని మద్యం తక్కువ ధరకు నగరానికి తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 66 బాటిళ్ల ఎన్‌డీపీ మద్యం, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు తాళ్లపెల్లి శ్రీనివాస్, మాధవీలత, ఎస్సైలు కిషోర్‌బాబు, రజిత, సిబ్బంది సురేష్, రాజు, వెంకన్న, వీరస్వామి, శివకుమార్, బాలు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట అగ్గిపాలు


దగ్ధమవుతున్న మొక్కజొన్న కంకుల రాశి

కేసముద్రం: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న పంట తీరా చేతికందే దశలో అగ్గిపాలైంది. రెక్కలు ముక్కలు చేసుకున్న ఆ రైతులు కళ్లముందరే పంట కాలిపోతుంటే వారికి కన్నీళ్లే మిగిలాయి. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల, పెద్దమోరితండా జీపీల్లో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వల గ్రామానికి చెందిన షానాల వీరారెడ్డి చెందిన 3 ఎకరాల మొక్కజొన్న కంకులను, పక్కనే ఉన్న రైతు మార్గం శ్రీనుకు చెందిన 1.30 ఎకరాల మొక్కజొన్న కంకులను పంటభూమిలో రాశులుగా పోసుకున్నారు. ప్రమాదవశాత్తు పంటకు నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపించి కుప్పలుగా పోసిన కంకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అదే విధంగా దేవరబోయిన రవికుమార్ అనే రైతుకు చెందిన 1 ఎకరం మొక్కజొన్న పంట, పక్కనే ఉన్న పెద్దమోరితండా జీపీకి చెందిన బాల కు చెందిన 3 ఎకరాల మొక్కజొన్న పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో, మంటలు వ్యాపించడంతో పంట దగ్ధమైంది. రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితంలేకుండా పోయింది. చేతికందిన పంట కాలిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి, హాజరైన అధికారులు, ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: ప్రజా పంపిణీ వ్యవస్థలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి.. అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి విజిలెన్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 6ఏ కేసులు, గోదాం, ప్రభుత్వ హాస్టళ్లకు బియ్యం పంపిణీ, మధ్యాహ్న భోజనం మొదలైన వాటిలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళ, డీఈఓ అబ్దుల్ హై, విజిలెన్స్ కమిటీ మెంబర్ అనితారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు, రేషన్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగిరం చేయండి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- మన ఊరు – మన బడి పనుల పురోగతిపై సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల్ని వేగిరం చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 223 పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులు చేపట్టగా.. ఇప్పటి వరకు 23 పాఠశాలలో పూర్తయ్యాయన్నారు. మిగతా పాఠశాలల్లో చివరి దశలో ఉన్నాయని తెలిపారు. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మిగిలిన పనులు ఈనెలలోపు పూర్తి చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. జూన్ 10లోపు ప్రహరీ, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట గదులు, పెయింటింగ్స్, తాగునీటి పనులు పూర్తి చేయాలన్నారు. పెయింటింగ్‌కు సంబంధించి అంచనాలను రెండ్రోజుల్లో ఇవ్వాలన్నారు. పూర్తయిన పెయింటింగ్ పనులకు సంబంధించి ఎంబీలు రికార్డు చేయాలన్నారు. ప్రతీ ఏఈ రోజుకు నాలుగు పాఠశాలలను సందర్శించి ఎన్ని రోజుల్లో పనులు పూర్తవుతాయో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. మన ఊరు–మన బడికి సంబంధించి నిధుల్లో ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున చేసిన పనులన్నింటికీ బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్డీఓ పీడీ సంపత్‌రావు, డీఈఓ వాసంతి, డీసీఓ కల్పన, వివిధ శాఖల ఈఈలు, డీఈలు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

భాగస్వామ్య పద్ధతిలో డెంగీని జయిద్దాం


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

ఎంజీఎం: ఈ ఏడాది భాగస్వామ్య పద్ధతిలో 'డెంగీ వ్యాధిని జయిద్దాం' అనే నినాదంతో అన్ని శాఖల సమన్వయంతో డెంగ్యూ వ్యాధిని నిర్మూలించడానికి కృషి చేయాలని వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎంజీఎం నర్సింగ్ స్కూల్ నుంచి ఐఎంఏ హాల్ వరకు డెంగీ వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ.. డెంగీ వ్యాధికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు సంబంధం లేకుండా వ్యాధి వ్యాప్తి చెందుతుందని, ప్రతీ శుక్రవారం డ్రైడే– ఫ్రైడే పాటిస్తూ దోమ లార్వా ఉండే నీటి నిలువ సామర్థ్యాలను గుర్తించి నిర్మూలించడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా నిర్మూలించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు చల్లా మధుసూదన్, పద్మశ్రీ, అనిల్‌కుమార్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు నాణ్యమైన వైద్యసేవలందించాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, పక్కన అధికారులు

హన్మకొండ అర్బన్: ఆరోగ్య మహిళా క్లినిక్‌లకు వచ్చే మహిళలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆరోగ్య మహిళా, కంటి వెలుగు, ఆరోగ్య ఉప కేంద్ర భవనాల నిర్మాణాల పురోగతిపై వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం సూచించిన ఎనిమిది అంశాలపై నాణ్యమైన సేవలందించాలన్నారు. జిల్లాకు 74 ఆరోగ్య ఉప కేంద్ర భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, స్థల సేకరణ పూర్తికాని ఇంకా 18 ఆరోగ్య ఉప కేంద్రాలలో స్థానిక తహసీల్దార్, వైద్యాధికారి, టీఎస్ఎంఐడీసీ ఇంజనీర్లు వెంటనే ప్రక్రియ పూర్తి చేసి, త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాశ్రీ, గీతాలక్ష్మి, టీఎస్ఎంఐడీసీ ఎస్ఈ దేవేందర్‌కుమార్, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, డీసీఓ ఎస్‌హెచ్ ఎం.శ్రీనివాస్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బతో తునికాకు కూలీ మృతి


ఉపేంద్ర(ఫైల్)

బయ్యారం: వడదెబ్బకు గురై తునికాకు కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని చింతోనిగుంపు గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోగ ఉపేంద్ర(38) సోమవారం తునికాకు సేకరణకు అటవీప్రాంతానికి వెళ్లింది. సాయంత్రం సమయంలో అస్వస్థతకు గురి కావటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మంగళవారం రిఫర్ చేయగా అంబులెన్స్‌లో వరంగల్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకన్నతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.